
ప్రజాశక్తి
ఆదివారం 7 జులై 2024
5
పార్వతీపురం మన్యం



రేపు ఐటిఐలో అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 8న అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్ లే లాండ్, ఎల్అండ్‌టి కంపెనీల్లో అప్రెంటిస్ కోసం ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, కోపా ట్రేడ్‌లకు సంబంధించిన మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం గిరిజనాన్ని ఏటా పట్టిపీడిస్తోంది. వర్షాకాలంలోకి ప్రవేశించినా తాగునీటికి ఇబ్బందులు పడటమే అందుకు తార్కాణం. మండలంలోని లాలగాడిగూడ, ఈతమానుగూడ గ్రామాల గిరిజనులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మంచినీటి బావి ఒకటి ఉన్నా వేసవి వస్తే పూర్తిగా అడుగంటి పోతోంది. గిరిజనం దాహార్తిని తీర్చే ఆ బావి నీరు లేక మూలకు చేరింది. గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటర్ల దూరంలో రాళ్లు తేలిన రహదారిని దాటుకుంటూ వెళ్లి కొండలపై ఉన్న ఊటగెడ్డ నీరు తెచ్చుకుంటున్నారు. కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.



నిరసన తెలియజేస్తున్న లాలగాడిగూడ గిరిజనులు

వర్షాకాలంలోనూ.. తాగునీటికి కటకట

- లాలగాడిగూడ, ఈతమానుగూడ గిరిజనుల ఆందోళన
- కలుషిత నీటితో అస్వస్థత
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీ గిరిశిఖర గ్రామాలైన లాలగాడిగూడ, ఈతమానుగూడ గిరిజనం దాహార్తితో అల్లాడి పోతున్నారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 60 ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వారికి నేటికీ సరైన రక్షిత తాగునీటి సదుపాయం లేదు. మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో గ్రామానికి దూరాన ఉన్న ఊటగెడ్డకు వెళ్లి తాగునీరు, ఇతర అవసరాలకు తెచ్చుకుంటున్నారు. గ్రామానికి దూరంగా ఊటగెడ్డ ఉండడంతో ఒకరిద్దరు వెళ్లలేని పరిస్థితి. నలుగురైదుగురు గుంపులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో గెడ్డకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే మీ అందరికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు ఎవరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు మొరపెట్టుకుంటున్నారు.

హామీలకే పరిమితం

నాలుగేళ్ల క్రితం ఈ గ్రామాలకు తాగునీటి పథకం మంజూరైందని చెప్పారు. త్వరలో నీటి సౌకర్యం కల్పిస్తామని అప్పటి ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఇది హామీలకే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు. రహదారి పూర్తిగా రాళ్లు తేలి ఉంది. దీంతో అత్యవసర సమయంలో డోలీ మోతే దిక్కవుతోంది. గిరిజనుల సమస్యలను కొత్త ప్రభుత్వమైనా తక్షణమే పరిష్కరించాలి.

– ఆరిక గంగారావు, గిరిజన సంఘం నాయకుడు

ధరలను నియంత్రించాలి

జాయింట్ కలెక్టర్ శోభిక

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక.. సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శనివారం సంబంధిత శాఖలతో, రైస్ మిల్లర్లతో, హోల్‌సేల్ డీలర్లతో ధరల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ధరలు పెరుగుతున్న దృష్ట్యా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించే క్రమంలో సరఫరాదారులను గుర్తించి నివేదిక అందించాలన్నారు. నిత్యావసర సరకులు ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు అమ్మకూడదని ఆదేశించారు. ధరల పెరుగుదల సామాన్య కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవాలన్నారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సరుకులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసర సరకుల ధరలపై ట్రేడర్ల మధ్య వ్యత్యాసం ఉండకూడదని చెప్పారు. మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కె.శివప్రసాద్, మార్కెటింగ్ శాఖ డిడి ఎల్.అశోక్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి కె.రత్నరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి శోభిక



మంత్రికి వినతి అందిస్తున్న ఎక్సైజ్, ఎస్ఇబి అధికారుల సంఘం ప్రతినిధులు

ఎక్సైజ్ శాఖ నిర్వీర్యం

మంత్రిని కలిసిన ఎక్సైజ్, ఎస్ఇబి అధికారుల సంఘం

ప్రజాశక్తి-సాలూరు

గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ , ఎక్సైజ్ శాఖలుగా విడదీయడం ద్వారా శాఖని నిర్వీర్యం చేశారని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సంఘం నాయకులు మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం సమర్పించారు. శనివారం మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం అనాలోచితంగా ఎక్సైజ్ శాఖ నుంచి కొంతమంది సిబ్బంది, అధికారులను వేరు చేసి ఎస్ఇబిని సృష్టించిందని చెప్పారు. ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖని లా అండ్ ఆర్డర్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్‌కి అనుసంధానం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వానికి రావాల్సిన స్థాయిలో ఆదాయం రాలేదని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా పెద్దగా అమ్మకాలు జరగలేదని చెప్పారు. మద్యం ధరల పెంపు వల్ల మందుబాబులు సారా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారని వివరించారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను మార్పు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు ఎస్.శ్రీనివాసరావు, కె.కామేశ్వరరావు, ఎ.రామమూర్తి, కె.సురేష్, ఎం.వెంకటరావు ఉన్నారు.

8న పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఈ నెల 8న బెలగాంలో రైతు బజార్ కేంద్రం వెనుక ఉన్న పింఛనుదారుల కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం సబ్ రిజిస్టర్ పరిధిలో పింఛనుదారులంతా హాజరుకావాలని కోరారు.



విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

గిరిజన విద్యపై ప్రత్యేక శ్రద్ధ

ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ సూచించారు. శనివారం మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో విద్యా బోధన సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధ వహించి మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యాసంస్థల్లో బోధన చేపడుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు శ్రద్ధతో బోధించాలన్నారు. విద్యాసంస్థలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మిటరీ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

అనంతరం ఆయన వంటగదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ ఆహార పదార్థాలను అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన గిరిజన గురుకుల బాలికల కళాశాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. అధ్యాపకులు ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మరుగుదొడ్లు, డార్మిటరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యవతి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి నాయుడు, భద్రగిరి గిరిజన సంక్షేమ శాఖ ఎఇ అప్పారావు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం

పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, మక్కువ

సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయపార్వతి.. వైద్యులను ఆదేశించారు. ఈ మేరకు పెదబొండపల్లి, దోకిశీల, మక్కువ, శంబర, మామిడిపల్లి పిహెచ్‌సిలను డిఎంఒ టి.జగన్మోహన్‌రావుతో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి ప్రతిరోజూ నమోదు అవుతున్న రోగుల సంఖ్య, అందులో జ్వర లక్షణాలతో ఎంత మంది వస్తున్నారు, చేపడుతున్న ఆరోగ్య పరీక్షలు తదితర వివరాలపై వైద్యాధికారులు, సిబ్బందిని ఆరాతీశారు. మలేరియా, డెంగీ, సీజనల్ జ్వరాలను గుర్తిస్తే సత్వరమే చికిత్స అందజేయాలని ఆదేశించారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి మలేరియాగా నిర్ధారణ అయిన కేసుల వివరాలు పరిశీలించారు. మలేరియా మందుల లభ్యతను పరిశీలించి ఆసుపత్రిలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. డయేరియా లక్షణాలు గుర్తిస్తే వెంటనే ఐవి ఫ్లూయిడ్స్, చికిత్స అందజేయాలన్నారు. ప్రసవ గదులను, కాన్పుల రికార్డులను తనిఖీ చేశారు. పిహెచ్‌సిల్లో సాధారణ ప్రసవాలపై దృష్టిసారించాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో, ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో డెమో యోగేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.



మందులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వ్యాధుల బారిన పడుతున్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజురోజుకు ఆస్పత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతుందని, వైద్యం కోసం వస్తున్న గిరిజనులకు సరైన సౌకర్యాలు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంచాలు చాలక ఒకే మంచం ఇద్దరు, ముగ్గురు రోగులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. మలేరియా రోగుల సంఖ్య పెరుగుతుందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందులు అందుబాటులో లేవని చెప్పారు. ప్రయివేటు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. వీటిపై అధికారులు దృష్టిసారించి మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని కోరారు.

టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

భూదేవి, వ్యతిరేక గ్రూపును సస్పెండ్ చేయాలన్న మరో గ్రూపు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో టిడిపిలో విభేదాలు మరోమారు భగ్గుమన్నాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవితోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న నాయకులను వెంటనే పార్టీ నుంచి తొలగించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల కార్యదర్శి గండి రామినాయుడు, వీరఘట్టం మండల అధ్యక్షులు ఉదయ్ భాస్కర్, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. శనివారం వీరఘట్టం రోడ్డులోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూదేవి గ్రూపు పార్టీలో కొనసాగితే తీరని నష్టం చేకూరుతుందన్నారు. ఎన్నికల ముందు పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపించారు. వైసిపికి అనుకూలంగా పనిచేసి, టిడిపి మద్దతు ఇచ్చిన జనసేన అభ్యర్థి జయక్రిష్ణను ఓడించాలని ప్రయత్నించారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 2019 నుండి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న నేతలు సామంతుల దామోదర్‌రావు, కండాపు వెంకటరమణ, వారాడ సుమంత్‌నాయుడు, పైల సత్తిబాబు, గుమ్మడి సింహాద్రి, తదితరులు ఇప్పుడు పార్టీలో హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే వారిని పార్టీ నుండి తొలగించాలని జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావును కోరారు. ఈ సమావేశంలో జాడ శ్రీధర్, వెన్నపు శ్రీనివాస్ రావు, అనిల్, కిమిడి కాశీ నాయుడు, తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు జారీ

పార్వతీపురంరూరల్ : జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు (హిజ్రాలు) సౌకర్యాలు, రాయితీలను పొందేందుకు ధ్రువపత్రాల మంజూరు చేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సహాయం పొందాలనుకునే ట్రాన్స్‌జెండర్లకు ధృవీకరణ తప్పనిసరని చెప్పారు. పింఛను, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ప్రభుత్వ శాఖలు అందించే పథకాల ప్రయోజనాలను పొందడానికి గుర్తింపు ధ్రువపత్రాలు జారీ చేస్తామని తెలిపారు. వివరాలకు 9502666688, 9133463549 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సంపూర్ణ అభియాన్‌తో అభివృద్ధి

ప్రజాశక్తి -భామిని

విద్య, వైద్య, ఐసిడిఎస్, వ్యవసాయ, స్వయం సహాయక సిబ్బంది సమన్వయంతో సంపూర్ణ అభియాన్ ద్వారా సంపూర్ణ అభివృద్ధి సాధించవచ్చని నీతిఅయోగ్ అధికారి అనికా మాజీ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం సంపూర్ణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పిరేషనల్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మహేశ్వరరావు మాట్లాడుతూ భామిని మండలాన్ని కేంద్రం నీతి అయోగ్ ఆకాంక్షల ప్రాంతంగా గుర్తించిందన్నారు. మండలంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ద్వారా ఈ నెల ఒకటో తేది నుంచి సెప్టెంబర్ 31 వరకు విద్య, వైద్య, పోషణ, వ్యవసాయ, ఆర్థిక రంగాల్లో సాధించాల్సిన లక్ష్యాలను సూచించారు. లక్ష్యాలు సాధించేందుకు మండలంలో ఆ వ్యవస్థలు కృషి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో గర్భిణులకు పూర్తి స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్ దీపిక రాణి తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు భూ సార పరీక్షల ప్రాధాన్యత, ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువులపై అవగాహన కలిగిస్తున్నామని వ్యవసాయ అధికారి సింహాచలం తెలిపారు. ఎన్ఆర్ఇజిఎ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసేలా చూడాలని నీతి అయోగ్ అధికారిని ఎంపిపి తోట సింహాచలం కోరారు. అనంతరం సంపూర్ణ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఇఒ పగడాలమ్మ, ఎంపిడిఒ రావాడ కిశోర్‌కుమార్, సిపిఒ వరహారాజులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్, మండల ప్రజా ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సంపూర్ణ అభియాన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నీతిఅయోగ్ అధికారి అనికా, తదితరులు

లక్ష్యం మేరకు అడ్మిషన్లు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష్యం ప్రకారం విద్యార్థుల అడ్మిషన్లు పూర్తిచేయాలని పార్వతీపురం ఐటిడిఎ డిడి రుగ్మండయ్య.. జరగాలని, ప్రతి విద్యార్థి సమీప పాఠశాలలకు వెళ్లేలా ప్రధానోపాధ్యాయులు, గురుకులాల ప్రిన్సిపల్స్, డిప్యూటీ వార్డెన్లు, వార్డెన్లకు సూచించారు. మండలంలోని ఏకలవ్య పాఠశాలలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాల హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాల బాలికలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాలలు పని ప్రదేశాల వద్ద కనిపించరాదని సూచించారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ మోహనరాయుడు, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్, ఎంఇఒ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల మంత్రి ఇలాకాలో

కార్మికుల కంట కన్నీరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇలాకాలో కార్మికుల కంట కన్నీరు కారుతోంది. ఏళ్ల తరబడి బతుకీడుస్తున్న కార్మికుల ఉద్యోగాలు గాలికి ఎగిరిపోయినట్టుగా ఊడి పోతున్నాయి. దీంతో, వేలాది మంది కార్మిక కుటుంబాలవారు ఎలా బతకాలో అర్థం కాక పుట్టెడు దుఃఖంలో మునిగిపోతున్నారు. సుమారు 50రోజుల క్రితం కొత్తవలస మండలం కంటకాపల్లిలో పరిశ్రమను లాకౌట్ విధించిన జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ యాజమాన్యం కార్మికుల ఆకలిబాధలను లెక్కచేయడం లేదు. తాజాగా నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కూడా అక్రమ లాకౌట్ విధించారు. అంతకు ముందు చాలా పరిశ్రమలు మూతపడిన సంగతి తెలిసిందే. దీంతో, కార్మికుల జీవనం దినదిన గండంగా మారింది. అసలే విజయనగరం జిల్లా పారిశ్రామికంగా అత్యంత వెనుకబడిన ప్రాంతం. ప్రభుత్వ విధానాలు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి మాట అటుంచితే... ఉన్న ఉద్యోగాలు, ఉపాధి కూడా లేకుండా పోతున్నాయి.

ఒకప్పుడు ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలకు పుట్టినిల్లుగావున్న విజయనగరం జిల్లా నేడు తిరోగమిస్తోంది. జిల్లాలో గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండేవి. గత ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న యోన, ఇంపెక్స్ గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేచర్ నడుస్తోంది. బొబ్బిలిలోని సిరి ఫెర్రో ఒడిదుడుకుల మధ్య నడుస్తోంది. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం. ఫెర్రో క్రోమ్ ఉత్పత్తిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఛార్జీలు పెంచితే అనివార్యంగా వాటి మనుగడ భారమౌతుంది.



ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముఖ్యంగా విజయనగరం జిల్లాలోనూ ఒకప్పుడు జ్యూట్ మిల్లులు ఎక్కువగా ఉండేవి. జనపనార, గోగు (మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారవుతాయి. ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా జ్యూట్‌మిల్లులు ఆవిర్భవించాయి. ప్రభుత్వ విధానాల కారణంగా 1990 తరువాత కాలంలో జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి రావడం, నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం జ్యూట్ ఉత్పత్తులపైనా పడింది. దీంతో, ఒకప్పుడున్న తొమ్మిది జ్యూట్ మిల్లులకుగాను ఒకటే నడుస్తోంది. నెల్లిమర్ల జ్యూట్‌మిల్లులో 8ఏళ్ల క్రితం 5వేల మంది నుంచి 6వేల మంది కార్మికులతో కళకళలాడేది. ప్రస్తుతం పర్మినెంట్, తాత్కాలిక కార్మికులు మొత్తంగా 2వేలు మంది మాత్రమే పనిచేస్తున్నారు. సాలూరు జీగిరాం జ్యూట్ మిల్లు ఎప్పటికప్పుడు లాకౌట్‌కు గురవుతోంది. మిగిలినవన్నీ దాదాపు ఉనికి కోల్పోయాయి. ముఖ్యంగా విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస శాశ్వతంగా మూతపడ్డాయి. జిల్లాలో భీమసింగి, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీలు ఉండడంతో ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా 10,473 హెక్టార్లు మేర చెరకు విస్తీర్ణం ఉండేది. వాటిని ఆధునీకరించక పోవడంతో ప్రస్తుతం 3830 హెక్టార్లకు తగ్గింది. ఆర్థిక సంక్షోభం పేరుతో లచ్చయ్యపేట సుగర్స్, చెరకు విస్తీర్ణం తగ్గిపోయిందనే పేరుతో భీమసింగి ఫ్యాక్టరీ మూసివేయడంతో వేలాది మంది రైతులు, ఇటు కార్మికులు ఉపాధి కోల్పోయారు.

జిందాల్ పరిశ్రమ మూతతో 450మంది కార్మిక కుటుంబాలు, నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు మూతతో 2వేల కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఇలా పరిశ్రమల మూతతో వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయి. వారి జీవనం దిన దినగండంగా మారుతోంది. ఎన్నికల నేపథ్యంలో పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగాలు కల్పన పేరిట తెగేసి హామీలు గుప్పించిన నాయకులు ఏ మేరకు పరిశ్రమలను తెరిపించేందుకు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారో వేచి చూడాలి.

డిసిసిబి అభివృద్ధికి సహకారం

చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ●ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) అభివృద్ధికి అన్నివిధాలా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బ్యాంకు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, నాబార్డు సహకారంతో డిసిసిబి ఏర్పాటు చేసిన రెండు సంచార వాహనాలను, శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా బ్యాంకు ఆవరణలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే గత పదేళ్లుగా సహకార బ్యాంకు ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు. బ్యాంకు ఇస్తున్న రుణాల సంఖ్య సంతృప్తికరంగా ఉందని, డిపాజిట్లను పెంచాల్సి ఉందని, దానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. జిల్లాలో ప్రారంభమైన ఎఫ్‌పిఒలు ఇతర జిల్లాలకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. ప్రతీ మండలంలో డిసిసిబి బ్యాంకు శాఖను ప్రారంభించేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు.

విజయనగరం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, రైతులకు ఎంతగానో సహాయ సహకారాలను అందిస్తున్న డిసిసిబిని అభినందించారు. జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ సహకార బ్యాంకుకు అనుబంధంగా జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తున్నాయని, వీటిలో 11 సంఘాలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని తెలిపారు. పిఎసిఎస్‌ల బలోపేతానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. పెట్రోలు బంకుల నిర్వహణకు కూడా అనుమతిచ్చినట్లు చెప్పారు. డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్ కెవిఎన్ఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంకు ఆర్థిక స్థితిగతులు, అందిస్తున్న సేవలు, విస్తరణకు ఉన్న అవకాశాలను వివరించారు. సబల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ, తమ సంఘం కార్యకలాపాలను, సమస్యలను వివరించారు. ఎఫ్‌పిఒలను కూడా పిఎసిఎస్‌లుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, నాబార్డు డిడిఎం టి.నాగార్జున, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర భేష్

పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర శ్లాఘనీయమని జిల్లా సహకార అధికారి పి.రమేష్ కొనియాడారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా, శనివారం స్థానిక జిల్లా సహకార బ్యాంకు ఆవరణలో పతాకావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిఒ రమేష్ మాట్లాడుతూ, పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమాల్లో సహకార సంఘాలు అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. సరైన నాయకత్వం ఉంటే సహకార సంఘాలు గణనీయమైన విజయాలను సాధిస్తాయని చెప్పారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి సహకార సంఘం సభ్యుడు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివద్ధి అధికారి టి .నాగార్జున, డిసిసిబి ఇన్‌ఛార్జ్ సిఇఒ చిప్పాడ ఉమామహేశ్వర రావు, జనరల్ మేనేజర్ కెవివి సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు తెరిపించడానికి కృషి చేశా

మాజీ మంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్‌మిల్లు తెరిపించేందుకు తనవంతు కృషి చేశానని మాజీ మంత్రి రాజన్నదొర తెలిపారు. శనివారం 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన 'జీగిరాం జ్యూట్‌మిల్లు తెరిపిస్తారా?' కథనంపై ఆయన స్పందించారు. జ్యూట్‌మిల్లు యాజమాన్యంతో తాను సంప్రదింపులు జరిపానని గుర్తుచేశారు. యాజమాన్యం ఎప్పటికీ స్పందించకపోవడంతో కార్మికుల తరపున హైకోర్టులో కేసు కూడా వైసిపి నాయకుడితో వేయించానని చెప్పారు. కార్మికులు కేసు వేస్తామంటే కోర్టు ఖర్చులు తాను భరిస్తానని కూడా చెప్పినట్లు తెలిపారు. కానీ, కార్మికులు ముందుకు రాలేదన్నారు. గతంలో అనేక సార్లు ప్రస్తుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జ్యూట్‌మిల్లు తెరిపించి సక్రమంగా నడిపిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, మంత్రి సంధ్యారాణి మిల్లు తెరిపించి కార్మికులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జ్యూట్‌మిల్లు కార్మికులు కూడా టిడిపికి మద్దతుగా నిలిచారని చెప్పారు. ఇప్పటికే బొబ్బిలి, విజయనగరం ప్రాంతాల్లో ఉన్న జ్యూట్‌మిల్లులు మూతపడ్డాయని తెలిపారు. జీగిరాం జ్యూట్‌మిల్లు యాజమాన్యంలో టిడిపి సానుభూతిపరులు ఉన్నందున మంత్రి సంధ్యారాణి కృషి చేస్తే మిల్లు తెరిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలోని కృష్ణా స్టోర్స్ ఎరువుల దుకాణాన్ని శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ సిఐ తిరుపతిరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.జె.వి. రామ్మోహనరావు.. రికార్డులు స్వాధీనం చేసుకొని పరిశీలించారు. గోడౌన్లో ఎరువుల నిలువలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఎరువులు నిలువలు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి కె.తిరుపతిరావుకు అభినందనలు తెలిపారు. గోడౌన్లో కొన్ని రకాల ఎరువులు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎడి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ శుక్రవారం కొమరాడ, పార్వతీపురంలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. శనివారం సాలూరులో ఎరువుల దుకాణం తనిఖీ చేశామన్నారు. రైతులకు ఇచ్చే బిల్లుల్లో వ్యత్యాసం ఉందన్నారు. ఈ మేరకు 34.92 లక్షల రూపాయలు విలువచేసే 113.67 టన్నుల ఎరువులను నిలుపుదల చేశామని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో గల ఎరువుల. పురుగు మందుల దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు, కిరణ్ పాల్గొన్నారు.

10న అంగన్వాడీల కోర్కెల దినం

ప్రజాశక్తి-పాచిపెంట

ఈ నెల పదో తేదిన అంగన్వాడీల కోర్కెల దినం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కె.పార్వతీదేవి తెలిపారు. యూనియన్ నాయకులు ఎన్.బంగారమ్మ, రమాదేవి ఆధ్వర్యంలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒలను అమలు చేసి కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. 10న పాచిపెంట ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న గాంధీ బొమ్మ నుంచి ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింత పోలిరాజు, కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొమరాడ : ఈ నెల 10న కార్మిక డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఆశా వర్కర్లు, మిడ్ డే మీల్స్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ సిహెచ్ అనురాధ, ఆశా వర్కర్ల మండల యూనియన్ నాయకులు ఆర్.రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, మంగ, ఆరుద్ర, లక్ష్మి, పార్వతి, సుజాత, వెంకటలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆర్‌వైఎస్ఎస్‌టి సభ్యులు ఎస్. రాజారావు అన్నారు. శనివారం మండలంలో మంత్రజోల, సూర్యనగరం గిరిజన గ్రామాల్లో రైతులు సాగుచేసిన నవధాన్యాలు, రాగులు నాటే విధానం పరిశీలించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు నవధాన్యాలు వేసి, 40 రోజుల్లోపు భూమిలో కలిపి దున్నడం వల్ల ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. చిరుధాన్యాలు వేసుకోవడం వల్ల వాతావరణ పరిస్థితులను, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. పెట్టుబడులు తక్కువ, దిగుబడులు ఎక్కువ వస్తాయని చెప్పారు. వరి విస్తీర్ణం తగ్గించి, చిరు ధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి కమిటీలతో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి -భామిని

జనసేన పార్టీ మరింత బలోపేతానికి గ్రామ స్థాయి కమిటీలు కీలకమని ఆ పార్టీ మండల అధ్యక్షులు రుంకు కిరణ్‌కుమార్ తెలిపారు. భామిని మండలంలోని బిల్లుమడ గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. మండలంలో జనసేన భవిష్యత్తు కార్యాచరణ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు అనిల్, మహేష్, ఈశ్వరరావు, వైకుంఠరావు, చందు పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలో మినీగురుకులంలో శనివారం వైద్యాధికారులు భానుప్రతాప్, శివశంకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫీవర్ కేసులకు చికిత్స అందజేశారు. పిల్లల పట్ల వర్షాకాలంలో తగు జాగ్రత్తగా ఉండాలని వారు సూచనలు చేశారు. వేడి నీళ్ల తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, ఎఎన్ఎం ఝాన్సీరాణి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు కేసులు నమోదు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని తుడి గ్రామంలో సచివాలయం గేటు పగలకొట్టినందుకు సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు పోలీసులకు శనివారం ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. ఇదే గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏజెన్సీలో దంచికొట్టిన వాన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పది రోజుల తర్వాత గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చిరుజల్లులతో ప్రారంభమై.. గంటకుపైగా కుండపోతలా కురిసింది. భారీ వర్షంతో పొలాలు నీటనిండాయి. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట ప్రధాన రహదారులపై నీరు చేరింది. ఖరీఫ్ పనులు ప్రారంభానికి ఈ వర్షం ఎంతగానో అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కురుపాంలో భారీవర్షం

కురుపాం : కురుపాం, పరిసర గిరిజన గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరై అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆకాశం పూర్తిగా మేఘావృతమై భారీ వర్షం కురవడంతో ఉపశమనం లభించింది. ఈ వర్షాలతో వ్యవసాయ పనులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సాగు సన్నద్ధతలో భాగంగా దుక్కులకు లాభిస్తుందని రైతులు అంటున్నారు.



కురుపాంలో కురుస్తున్న వర్షం

విడివికెతో ఆర్థిక అభివృద్ధి

జిసిసి ఎమ్‌డి సురేష్ కుమార్



విడివికె సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్‌డి సురేష్ కుమార్

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన సహకార సంస్థ, వెలుగు సమన్వయంతో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలు(విడివికె) ద్వారా గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక స్వావలంబన ఉంటుందని జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ గేదెల సురేష్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలో మండ గ్రామంలో వీడివికెను సందర్శించారు. సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ఆదాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ గురించి సభ్యులు విన్నవించారు. పిఎం జన్మన్ స్కీమ్ వల్ల వచ్చే ప్రయోజనాలను సభ్యులందరికీ అవగాహన కల్పించారు. 139 మంది సభ్యులను స్కిల్ ఇండియా పోర్టల్‌లో రిజిస్టర్ చేయించారు. మండ విడివికెలో చీపుర్లపై ఆధారపడటం వల్ల వారికి చీపుర్లు కటింగ్ మిషన్‌ను అందజేశారు. మిగతా విడివికెలు ఎలా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట టిటిడి దేవస్థానాన్ని సందర్శించారు. స్వయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిసిసి జిఎం జి.సంధ్యారాణి, పాతపట్నం, సీతంపేట బ్రాంచ్ మేనేజర్లు నరసింహులు, కృష్ణారావు, ఎపిడి సన్యాసిరావు, ఎపిఎం విజయకుమారి, సిసిలు పాల్గొన్నారు.

స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు వేద్దామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బెలగాంలో చర్చి వీధిలో ఉన్న డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్కులో కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేపట్టారు. స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. దీనిలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శ్రమదానం చేస్తున్న కమిషనర్, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్

అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులను అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా తీర్చిదిద్దా లని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల ముఖ్య కార్యదర్శి కె. సునీల్ రాజుకుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజయనగరం, మన్యం జిల్లాలలో పనిచే స్తున్న ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వుండేట ట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

ప్రతి విద్యార్థి 100 శాతం విద్యాప్రమాణాలు కలిగి వుండేటట్లు శిక్షణ ఇవ్వాలని, సమాజంలో మంచి విద్యార్థులుగా తీర్చిదిద్ద బడే విధంగా సిబ్బంది తమవంతు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా వుండే టట్లు వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేయించి వారిని ఆరోగ్యవంతులుగా వుండేటట్లు చూడాలని ఇది ప్రతి ఒక్కరి భాధ్యతని తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాల విడిచి వెళ్ళేట ప్పుడు పరిపూర్ణమైన నైపుణ్యా లతో, కంప్యూటర్ స్కిల్స్ ప్రతిభవుండేటట్లు తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమా వేశంలో జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, విజయనగరం, మన్యం జిల్లాల ప్రిన్సిపాల్స్, సూపరింటెం డెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి -భామిని

ప్రతీ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని, అందుకు పిల్లలు సులువుగా విద్యాంశాలు నేర్చేలా బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి గారి పగడాలమ్మ అన్నారు. శనివారం భామిని ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతిలో విద్యా బోధన, మధ్యాహ్న భోజన అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిచూశారు. పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు చొరవచూపాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, ఎంఇఒ ఊయక భాస్కరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

వికలాంగులకు ఆర్థిక స్వావలంబన



జేసుదాసు సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మక్కువ

టిడిపితోనే వికలాంగులకు ఆర్థిక స్వావలంబన చేకూరనుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్ అన్నారు. వికలాంగుల సంఘం నాయకులు, టిడిపి నేత సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం వికలాంగుల పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు ఎన్.జేసుదాసును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు కె.శంకర్రావు, పి.గంగులు, అన్నందొర, టిడిపి నాయకులు డి.కేశవరావు, పి.మల్లేశ్వరరావు, ఎం.సింహాచలం, కె.కాశినాయుడు, శంకర్ నాయుడు, లండ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరవక.. కరవక.. టీకా వేసుకోండిక



సీతంపేట.. కుక్కలకు టీకా వేస్తున్న ఎడి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -విలేకర్ల బృందం

జిల్లా వ్యాప్తంగా పశువైద్య కేంద్రాల్లో శనివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వాటి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానులకు వైద్యాధికారులకు వివరొచారు. మూగజీవాల పెంపకంలో అవగాహనతోపాటు అప్రమత్తత ఎంతో అవసరమని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ శివాల మన్మథరావు అన్నారు. పార్వతీపురం చాకలి బెలగాం ఏరియా పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకరమైన జూనోసిస్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల మనుషులు, జంతువులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు.



పార్వతీపురంరూరల్.. కుక్కకు టీ వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మన్మథరావు



బలిజిపేట .. టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి గణేష్



సీతానగరం.. టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ ఎడి దీనకుమార్, డాక్టర్ ఎస్.రామారావు



కురుపాం.. పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి శైలజ